క్లుప్తంగా

ఏజెన్సీ చట్టాన్ని సవరించాలి

చండ్రుగొండ: 1/70 చట్టాన్ని సవరించాలని ఏజెన్సీ దళితుల సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు నడ్డి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిజాం కాలం నుంచి ఏజెన్సీ ఏరియాలో గిరిజనులతోపాటు దళితులు సమానంగా జీవనం సాగించారన్నారు. 1970 తీసుకువచ్చిన 1/70 చట్టంతో దళితులకు అన్యాయం జరుగుతుందన్నారు. నేటికీ దళితులు విద్య, వైద్యం, ఉపాధి రంగాలతోపాటు సామాజికంగా వెనుకబాటును ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు స్పందించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు.

16 నుంచి లక్ష్మీదేవి జాతర

గుండాల: ఈ నెల 16వ తేదీ నుంచి గుండాల మండలం తూరుబాక గ్రామంలోని జోగవారి ఇలవేల్పు అయిన లక్ష్మీదేవి జాతర ప్రారంభమవుతుందని, అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఏఐఎఫ్‌డబ్ల్యూసీపీ జిల్లా కార్యదర్శి జోగ రాంబాబు తెలిపారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 16న అమ్మవారి ప్రతిష్ఠాపనం, కుంకుమ పూజ, రాత్రి గుడిమేలుకొలుపు ఉంటుందన్నారు. శనివారం ఉదయం నుంచి గ్రామంలో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంతో పాటు, గంగాస్నానం, గిరిజన సాంప్రదాయం ప్రకారం నాట్యప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఆదివారం దేవతకు శుంకు పండుగ, భక్తుల మొక్కులు చెల్లింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ జాతరకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు హాజరుతున్నారన్నారు. 17, 18న అన్నదాన కార్యక్రమం జోగ రాంబాబు, అనసూర్య దంపతుల ఆధ్వర్యంలో ఉంటుందన్నారు. వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మణుగూరురూరల్: మండల పరిధిలోని కొండాయిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు పల్లపు శంకర్ ఇటీవలే మరణించాడు. సోమవారం శంకర్ దశదినకర్మలను నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సతీమణి రేగా సుధారాణి హాజరై మృతుని చిత్రపటానికి పూలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుమలరావు, బోయిళ్ల రమణయ్య, మామిడిపల్లి సీతారాం, రాజు, నాని, సతీష్, మహిళా నాయకురాలు టి.రజిత, గౌసియ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గుండాల: ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తికి గుండాల ఎస్సై కిన్నెర రాజశేఖర్ సోమవారం రూ.5వేలు అందించారు. మండలంలోని జామరగూడెం గ్రామానికి చెందిన పూనెం రాములు ఇటీవల ముత్తాపురం గ్రామ సమీపంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంఘటన విధితమే. కాగా ఎస్సై అతని ఇంటికి వెళ్లి పరామర్శించి వైద్యం ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు.

ఐకేపీ వీఓఏల సమ్మె నోటీస్

చండ్రుగొండ: ఈ నెల 16 నుంచి 18 తేదీ వరకు చేపట్టనున్న టోకెన్ సమ్మెను పురస్కరించుకుని వీఓఏలు సోమవారం ఐకేపీ ఏపీఎం సంతోష్‌కుమార్‌కు నోటీస్ అందజేశారు. న్యాయమైన తమ డిమాండ్లను సత్వరమే ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం అధ్యక్షురాలు ఎస్డీ అమీన కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి.నరేష్, ఎస్‌కె.కమాల్, సీహెచ్ శివలక్ష్మి, పి.సుజాత పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం నారాయణరావు పేట పంచాయతీలోని గొత్తికోయ అవాస గ్రామం సిరిగుండం గ్రామంలో లివింగ్ సాక్రిఫైజ్ మిషనరీస్ సంస్థ చేపట్టిన సేవలు అభినందనీయం అని జెడ్పీ చైర్మన్ కోరంకనకయ్య అన్నారు. సోమవారం గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాటర్ డవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా సోలార్ ద్వారా పంపునీటి సరఫరాను ప్రారంభించి మాట్లాడారు. జెడ్పీటీసీ తెల్లం సీతక్క, డాక్టర్ తెల్లం వెంకట్రావు, డీసీసీబీ డైరెక్టర్ తుల్లూరి బ్రహ్మయ్య, ఎంపీటీసీలు మడకం రామారావు, సోడి తిరుపతిరావు, సర్పంచ్ రజినీ,ఆదినారాయణ,రంజిత్ పాల్గొన్నారు.

ఇంటింటికీ టీడీపీ

మణుగూరురూరల్: తెలుగుదేశం పార్టీ మండల నాయకురాలు పసునూరి సీత ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ టీడీపీ– బొట్టు పెట్టుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ తాతా మాధవీలత, సీనియర్ నాయకుడు చందా మధులు హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. ఆ పార్టీ నాయకులు చావా శ్రీదేవి, పురిటి విజయలక్ష్మి, ధర్మరాజుల శంకర్, అనసూయ, సరిత, ప్రభావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మిరప రైతుకు ఊరట

- అధికారుల సూచనలతో తామర పురుగుపై యుద్ధం
- మార్కెట్‌లో మిర్చికి మద్దతు ధర
- శ్రమకు తగిన ఫలితంపై ఆశాభావం



మిరపకాయలను బస్తాల్లో నింపుతున్న రైతులు



కల్లాల్లో ఆరబోసిన మిరపకాయలు

పినపాక: గత ఏడాది మిరప పంట సాగు చేసిన ప్రతి రైతూ ఆందోళన చెందాల్సిన వచ్చింది. తామర పురుగు వల్ల పంట దశలో ఉన్న మొక్కలకు రంగు మారిపోయి దిగుబడి సైతం అమాంతం తగ్గిపోయింది. అధికంగా సాగుచేసిన రైతుల తీవ్రంగా అప్పుల పాలయ్యారు. పినపాక మండల వ్యాప్తంగా గోదావరి తీరప్రాంత రేగడి నేలల్లో సుమారు 900 ఎకరాల్లో మిర్చి సాగు చేయగా.. మెజారిటీ రైతులు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సంవత్సరం మిర్చికి పలుకుతున్న ధర కొంత ఊరటనిస్తోంది.

ప్రస్తుతం మండల వ్యాప్తంగా 800 ఎకరాల్లో మిరప పంట సాగు చేస్తున్నారు. ఈ ఏడాది మిర్చి పంట వేసిన రైతు కళ్లల్లో ఆనందం నెలకొంది. ప్రస్తుతం రెండో కోత ప్రారంభమైన సుమారు ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తామర పురుగు ప్రభావం ప్రస్తుతం సాగులో సైతం ఉన్నప్పటికీ వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు ముందస్తుగా గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఎకరం సాగుకు 1.5 లక్షల మేర పెట్టుబడి అవుతుంది. చీడపీడల ప్రభావం లేకపోతే కాస్త ఊరట లభిస్తుంది. ప్రస్తుతం కింటా మిర్చి మార్కెట్ ధర రూ.20 వేలు ఉండడంతో రైతుల్లో ఆనందం కనబడుతోంది. త్వరగా కోతలు పూర్తి చేసి మార్కెట్‌కు తరలించి గతేడాది భారాన్ని తగ్గించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ఏడెకరాల్లో సాగు చేశా..



గతేడాది చాలా నష్టం వచ్చింది. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్న నేపథ్యంలో తప్పక మళ్లీ ఏడు ఎకరాల్లో పంట వేశాను. సుమారు ఎకరన్నర పంటకు తామర పురుగు పుట్టింది. అధికారుల సూచనల మేరకు మందుల పిచికారీ చేస్తున్నాను. మార్కెట్లో ధర ఉన్నందున ఇబ్బందులు కాస్త తగ్గాయి. సాగుచేసిన పంట మొత్తం మంచిగా ఉంటే ఇంకా బాగుండేది.

– పురుషోత్తం, రైతు, వెంకట్రావుపేట

కౌన్సెలింగ్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీజీఎం పర్సనల్ రమేష్

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలోని విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు కౌన్సెలింగ్ ఏర్పాటు చేసి వారు విధులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం మణుగూరు ఏరియా పర్సనల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. కారుణ్య నియామకాల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఉద్యోగ నియామకాలు, సాఫ్ నిర్వహణలో పలు నియమ నిబంధనలు వివరించారు. ఉద్యోగుల పదవీ విరమణ బెనిఫిట్స్, సీఎంపీఎఫ్, పెన్షన్, గ్యాట్యూటీ, ఎఫ్‌టీబీఎస్, హెచ్‌బీఎల్ఐఆర్ ఎస్ క్లైమ్స్‌కు సంబంధించి ఆయా ఉద్యోగుల నుంచి తగిన డ్యాక్యూమెంట్లు తీసుకోవాలని, వాటిని త్వరగా క్లియర్ చేయాలని సూచించారు. సమావేశంలో సీనియర్ పర్సనల్ అధికారులు సింగు శ్రీనివాస్, ఎండి.మధార్‌సాహెబ్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మొల్లమాంబ జయంతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో వాల్మీకి రామాయణాన్ని తెలుగులో రచించిన తొలి తెలుగు శాలివాహన కుమ్మరి ఆడపడుచు మొల్లమాంబ 583వ జయంతి వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ శాలివాహన కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇందారపు లక్ష్మణ కుమార్ ప్రజాపతి మొల్లమాంబ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో కవయిత్రి మొల్లమాంబ విగ్రహ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లక్ష్మణకుమార్ కోరారు. జిల్లా కార్యదర్శి కొలిచలం నవీన్ కుమార్ ప్రజాపతి, విజ్జగిరి రవికిరణ్, రాధాకృష్ణ, రెల్లి తాతారావు, లక్ష్మణరావు, భాస్కర్, సత్యనారాయణ, శ్రీనివాస్, కోటి, విశ్వనాథం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

అశ్వారావుపేటరూరల్: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను అశ్వారావుపేటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భగత్‌సింగ్ సెంటర్‌లో భారత జాగృతి యువజన కన్వీనర్ చిక్కం గోపాలకృష్ణ, పాత ఎంపీడీఓ కార్యాలయంలో బీఆర్ఎస్ యువజన సంఘం బాధ్యులు మోటూరి మోహన్ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు, కలపాల శ్రీనివాస్, సుదర్శన్, బాలి కిరణ్, సోమని రాజారమేష్, పడాల అఖిల్, భార్గవ్, చిరంజీవి, టి.హరి, సాయి, సైదులు, మహబూబ్ పాల్గొన్నారు.

‘చైతన్యయాత్రకు తరలిరండి’



మాట్లాడుతున్న మిడియం బాబూరావు

చర్ల: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్యయాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మిడియం బాబూరావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బీఎస్ రామయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 17న రాష్ట్రంలోని హన్మకొండలో చైతన్యయాత్ర ప్రారంభమై.. మార్చి 19న చర్లలో ముగుస్తుందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొలగాని బ్రహ్మాచారి, మండల కార్యదర్శి కారం నరేష్, మండల కమిటీ సభ్యులు మచ్చా రామారావు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో చూపు మెరుగు



బూర్గంపాడు: టేకులచెరువులో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

బూర్గంపాడు: దృష్టి లోపాలు లేకుండా ప్రతి ఒక్కరి కంటి చూపును మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. టేకులచెరువు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ భూక్యా సుజాతతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కంటి వెలుగు కార్యక్రమం అన్ని గ్రామపంచాయతీల్లో కొనసాగుతుందన్నారు.18 ఏళ్లు నిండిన వారు దృష్టి లోపాలుంటే కంటి వెలుగులో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వమే ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తుందన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైనవారికి ఉచితంగా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాండవుల దర్గయ్య, భూక్యా శ్రీనివాసరావు, పెందెల వెంకటేశ్వర్లు, జక్కుల శ్రీనివాసరావు, నూకల బిక్షం పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రేసు లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని కె.దంతేనం గ్రామపంచాయతీలో కంటివెలుగు ప్రోగ్రాంను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు పథకాన్ని అందరూ వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం వైద్యుడు డాక్టర్ నిశాత్ రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ మూర్తి, నాయకులు కణితి రాముడు, జానిపాషా, దామెర్ల శ్రీనివాసరావు, మోతుకురి శ్రీకాంత్ పోడియం సుబ్బారావు, స్థానిక సర్పంచ్ పూజారి కృష్ణవేణి పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సోమవారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన పలువురికి నేత్ర వైద్యాధికారి డాక్టర్ జి.సంజీవరావు, డాక్టర్ సురేష్‌లు కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో కంటి శుక్లాలు ముదిరిన 15మందికి ఆయుష్మాన్ భారత్ క్రింద ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రతీ సోమ, బుధ, శుక్రవారాల్లో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తాని, ప్రతీ బుధవారం ఆపరేషన్స్ కొరకు ఖమ్మం రిఫర్ చేస్తామని డాక్టర్ సురేష్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి తరగతులు ప్రారంభం

అశ్వాపురం: భద్రాచలం నుంచి అశ్వాపురం మండలం మిట్టగూడెం తరలించిన ప్రభుత్వ బాలుర గురుకుల డిగ్రీ కళాశాలలో నేటి నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ స్వప్నకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పినపాక నియోజకవర్గానికి మంజూరైన బాలుర గురుకుల డిగ్రీ కళాశాలను ఈ నియోకవర్గంలోనే ఏర్పాటు చేయాలనే ఆలోచనతో మండల పరిధిలోని మిట్టగూడెంలో అద్దె భవనంలో వసతి గృహం ఏర్పాటు చేసి ఆ భవనంలోనే అన్ని ఏర్పాట్లతో తరగతులు ప్రారంభిస్తున్నారు. విద్యార్థులు అందరూ వచ్చారని మంగళవారం నుంచి తరగతులు ప్రారంభిస్తామని ప్రిన్సిపల్ తెలిపారు.

తాగునీటికి బోర్ ఏర్పాటు

దుమ్ముగూడెం: మండలంలోని కొత్త దంతేనంలో గ్రామపంచాయతీ నిధులతో చేపట్టిన తాగునీటి బోరు పాయింట్‌ను ఎంపీపీ రేసు లక్ష్మి కొబ్బరికాయ కొట్టి సోమవారం ప్రారంభించారు. కొత్త దంతేనం గ్రామపంచాయితీలో రాబోయే వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని మంచినీటి ఎద్దడి రాకుండా ముందుగానే నివారణ చర్యల్లో భాగంగా బోరు పాయింట్ వేశారు. కార్యక్రమంలో స్థానికి సర్పంచ్ పూజారి కృష్ణవేణి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ మూర్తి,నాయకులు కణితి రాముడు, జానిపాషా, దామెర్ల శ్రీనివాసరావు, మోతుకురి శ్రీకాంత్, పోడియం సుబ్బారావు, శెట్టి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సంతాపం

ములకలపల్లి: కామారెడ్డి జిల్లాలో గ్రామపంచాయతీ కార్మికుడి బలవన్మరణంపై స్థానిక జీపీ కార్మికులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఒంటెద్దు పోకడలతో జీపీ కార్మికుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయని అన్నారు. కార్మికులు చిక్కుల శ్రీను, మేకల రమేశ్, కొక్కెరగడ్డ సతీశ్, ఘంటా శ్రీనివాసరావు, గంగధరరావు, ఖమ్మంపాటి నాగరాజు, కొత్తపల్లి కృష్ణ, గొడ్ల ప్రసాద్, పసుపులేటి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

అశ్వాపురం: అశ్వాపురం మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన బొబ్బాల కొమరయ్యపై అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి బొబ్బాల కొమరయ్య అదే గ్రామానికి చెందిన బొబ్బాల కోటమ్మను కొన్నేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. కాగా, గత కొంత కాలంగా తనను పట్టించుకోవడం లేదని, మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నాడని సోమవారం కోటమ్మ అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై జితేందర్.. కొమరయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేతనాలు చెల్లించాలని సమ్మె

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీలో కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం సమ్మెలో దిగారు. సీఐటీయూ, ఇఫ్టూ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సమ్మెలో ఆ సంఘాల నాయకులు పల్లపు నాగేశ్వరరావు, రాజేందర్‌లు మాట్లాడుతూ.. మణుగూరు మున్సిపల్ కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదన్నారు. వేతనాలు లేకపోవడంతో తమ కుటుంబాలు వీధిన పడిపోతున్నాయన్నారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న తమకు ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. వేతనాలు చెల్లించే వరకు తమ సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు సాయమ్మ, పోశమ్మ, వేణు, లక్ష్మీనారాయణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



మురికిగుంటలో ఉన్న గేట్‌వాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ములకలపల్లి: నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ప్రధాన ఆశయంగా తాను కొనసాగుతున్నట్లు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావురావు తెలిపారు. మండల పరిధిలోని పాతగంగారం గ్రామంలో రూ.65 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి పుష్కలంగా నిధులు మంజూరౌతున్నట్లు తెలిపారు. తాళ్లపాయ శివారులోని పాములేరు వాగు ఉధృతికి కోతకుగురైన రోడ్డు మరమ్మతులకు 1.80 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సుమారు రూ.4 కోట్లతో మండలవ్యాప్తంగా సీసీరోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మి, కారం సుధీర్, గడ్డం భవాని, ఎంపీటీసీలు మడకం విజయ, సున్నం సునిత, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, ఎంపీడీఓ ఆర్. చిన్న నాగేశ్వరరావు, పీఆర్ఏఈ శివలాల్, కో–ఆప్షన్ సభ్యుడు జబ్బార్, పామర్తి వెంకటేశ్వరరావు, అడపా నాగేశ్వరరావు, కోప్పుల రాంబాబు, నందమూరి సురేశ్, ఏపీ రమణ, శేషగిరి, కోమాళ్ల దుర్గాప్రసాద్, కోటి తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా పరిష్కరించాలి..

డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రాంగణాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో నెలకొన్న సమస్యలను వారం రోజులలో పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అధికారులకు స్పష్టం చేశారు. మండల పరిధిలోని పాతగంగారం గ్రామశివారులోని డబుల్ బెడ్రూం ఇళ్లను ఎమ్మెల్యే మెచ్చా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరుగుదొడ్లకు కనీసం తలుపులు కూడా ఏర్పాటు చేయకపోవడంపై సంబంధితశాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ ఇళ్ల నిర్మాణంలో కొందరు అధికారులు, కాంట్రాక్టర్ల అలసత్వంతో పథకం అభాసుపాలౌతోందని అన్నారు. తాగునీరందించేందుకు ఏర్పాటు చేసిన గేట్‌వాట్ మూడు అడుగులమేర బురదనీటిలో మునిగి ఉండడాన్ని గమనించి, ఎంపీడీఓ ఆర్,చిన్ననాగేశ్వరరావు, కార్యదర్శి మునేశ్‌లను హుటాహుటిన అక్కడకు పిలిపించారు. గ్రామపంచాయతీల్లో నిధులులేకుంటే, ప్రత్యేకంగా తాను నిధులు మంజూరు చేస్తానని, పనుల్లో అశ్రద్ధ వహిస్తే సహించేదిలేదని తెలిపారు. వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, గేటువాల్ వద్ద మురికిగుంట తొలగించాలని ఆదేశించారు. సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అరకొర పనులు చేసినా అధికారులు ఎందుకు దృష్టి సారించడంలేదని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు అడపా నాగేశ్వరరావు, వాడే శేషగిరి, బొంతు నందు, కొప్పుల రాంబాబు తదితరులు ఉన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిశీలన

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ అశ్వారావుపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాలలో సోమవారం పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న అప్పయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాంబాబు కలిసి అశ్వారావుపేటలో కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలతోపాటు పలు ప్రభుత్వ ఖాళీ భవనాలను పరిశీలించారు. అనంతరం దమ్మపేట మండలం తాటి సుబ్బన్నగూడెంలోని ఎమ్మెల్యేను కలిసి కళాశాల ఏర్పాటుకు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా కొద్ది రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హైదారాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి అశ్వారావుపేటలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తే అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని వినతి చేయడంతో స్పందించిన సీఎం కేసీఆర్.. కళాశాల ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేయాల్సిందిగా ఆదేశించారు. దాంతో త్వరలోనే డిగ్రీ కళాశాల ఏర్పాటు కానుంది. స్థానిక విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ విద్యార్థి ఇష్టపడి చదవాలి



మైనార్టీ గురుకుల పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అశ్వారావుపేటరూరల్: ప్రతి విద్యార్థీ ఇష్టపడి చదవాలని స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో సోమవారం వేర్వేరుగా పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులంతా కలిసి ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు, మైనార్టీ గురుకులాల్లో అన్ని వసతులూ కల్పిస్తోందని, ఉచితంగా పుస్తకాలు అందిస్తోందని అన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని, కష్టపడి కాకుండా ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థులు ఆట, పాటలు, నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ సంగీత, హెచ్‌ఎం.నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం పరిధిలో 144 సెక్షన్

అశ్వాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఈ నెల 15 నుంచి 29 వరకు ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నందున కేంద్రం చుట్టూ 200 గజాల దూరం వరకు 144 సెక్షన్ విధించనున్నట్టు తహసీల్దార్ ఎం ఏ.రాజు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. తరగతి గదులు పరిశీలించి ప్రిన్సిపాల్ సత్యప్రకాష్‌తో మాట్లాడారు. విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రం చుట్టూ గుంపులుగా తిరగవద్దని సమీప ప్రాంతంలో జిరాక్స్‌లు నిర్వహించవద్దని ఆయన ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

పేకాట స్థావరంపై దాడులు

బూర్గంపాడు: మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం ఎస్సై సంతోష్ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.23వేల నగదు, 4 మోటార్‌సైకిళ్లు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు సీజ్ చేశారు. గుర్రాలకుంట శివారులోని వాగులో ఇసుక తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దాడులు నిర్వహించి ట్రాక్టర్‌ను, కంపగూడెం క్రాస్‌రోడ్ వద్ద మరో ట్రాక్టర్‌ను పట్టుకుని రెవెన్యూ శాఖకు అప్పగించినట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల్లో పెరుగుతున్న జ్వరాలు



బూర్గంపాడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

బూర్గంపాడు: మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాల తీవ్రత పెరుగుతోంది. గత కొన్నిరోజులుగా ప్రజలు జలుబు, దగ్గు, ఆయాసం, జ్వరాలతో బాధపడుతున్నారు. రోజురోజుకూ జ్వరాల తీవ్రత పెరుగుతోంది. వాతావరణ మార్పులతో పాటుగా కొత్త వైరస్‌లతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వీటికి తోడు దోమల ఉధృతి బాగా పెరిగింది. ఫలితంగా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు రోజుల తరబడి జ్వరాలతో బాధపడుతున్నారు. టైఫాయిడ్, మలేరియా, వైరల్ ఫీవర్లతో చిన్నారులు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. గ్రామాల్లో చాలామంది బాధితులు స్థానికంగా గ్రామీణ వైద్యులనే (ఆర్‌ఎంపీ) ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు చిన్నచితకా ఆస్పత్రులకు కూడా రోజుకు 50 మందికి పైగా రోగులు వెళ్తున్నారు. గ్రామాలలోని ప్రభుత్వ ఆర్యోగ ఉపకేంద్రాల్లో రోజూ 30 నుంచి 40 వరకు వైద్యసేవలను పొందుతున్నారు.

ప్రజలపై ఆర్థిక భారం

జలుబు, దగ్గు రోజుల తరబడి తగ్గకపోవటంతో ఊపిరితిత్తులలో నెమ్ము చేరి ఇన్‌ఫెక్షన్లకు గురవుతున్నారు. ఇన్ని రోజులు బాధించబడడంతో బాగా నీరసించిపోతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇన్ పేషంట్‌లుగా చేరుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో రోజుల తరబడి ఉండాలంటే చాలామంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. బెడ్లు, వైద్య పరీక్షలకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. మరోవైపు ఏఎస్‌ఎమ్‌లు, ఆశ వర్కర్లు కూడా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

జ్వరాలపై బూర్గంపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌ను వివరణ కోరగా జ్వరాలు మరీ తీవ్రస్థాయిలో లేవన్నారు. అయితే జలుబు, దగ్గు, అయాసంతోనే చాలామంది ఆస్పత్రులకు వస్తున్నారన్నారు. జ్వరపీడితులు కూడా రోజురోజుకూ పెరుగుతున్నారన్నారు. వాతావరణ మార్పులతో పాటుగా కొత్తగా వస్తున్న వైరస్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.